ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర - మల్కాపురం : శంకర్ ఫౌండేషన్ వారి ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని లివింగ్ స్టన్ ఆధ్వర్యంలో శనివారం 61వ వార్డు మల్కాపురం ఏడుగుళ్ళ వద్ద ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు) పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి ఆలోచన రావడం మంచి పరిణామాన్ని యువత మరింత సేవా గుణాలను పెంపొందించుకొని మంచి సేవ కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈయన వెంట స్థానిక నాయకులు కార్యకర్తలు శంకర్ ఫౌండేషన్ సిబ్బంది, లివింగ్ స్టన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లకు రక్షణ కల్పించే సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చెయ్యాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మరిపిల్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ : కోల్ కత్తాలో ఆర్జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాల వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా సంచలనమైందని అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం జూనియర్ డాక్టర్లు పెద్దఎత్తున నిర్వహించిన నిరసనలో సీపీఐ తరుపున పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహన తరువాత విశ్రాంతి తీసుకునేందుకు సెమినార్ హాల్ కి వచ్చిన యువతి మరుసటి రోజు ఉదయానికి అర్ధ నగ్నంగా శవమై కనిపించిందని, ఆమెపై దారుణంగా అత్యాచారం చేశారని, శరీరం ప్రైవేటు భాగాలపై తీవ్ర గాయాలై రక్తస్రావం జరిగినట్లు పోస్టుమార్టం ద్వారా వెల్లడైందని అన్నారు. ఈ ఘటనలో నిందితుడు ఒక్కడే కాదని, ఇది గ్యాంగ్ రేప్ అనీ, ఈ నేరంలో కళాశాల ప్రిన్సిపాల్ హస్తం ఉందని, ప్రిన్సిపాల్ డ్రగ్స్ మాఫియా, సెక్స్ రాకెట్ నడుపుతున్న విషయం ఆ అమ్మాయికి తెలిసి బయటపెడతానని అన్నందుకే గత రెండు నెలలుగా ఆమెను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని అన్నారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా వైద్య విద్యార్థులు, వైద్యులు విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారని తెలిపారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు జరిగిన దాఖలాలు ఉన్నప్పటికీ, జాతీయ స్థాయిలో వైద్య విద్యార్థులు, వైద్యులు, వైద్య సిబ్బంది ఒక్క తాటిపైకి వచ్చి విధులను బహిష్కరించి, నిరసన ప్రదర్శనలకు దిగడం ఇటీవల కాలంలో ఇదే ప్రథమమని అన్నారు. విధి నిర్వహణలో ఉన్న యువ వైద్యురాలిపై అమానుషంగా అత్యాచారం జరిగిన తీరు, రోజురోజుకీ వెలుగులోకి వస్తున్న విషయాల దృష్ట్యా ఈ ఉదంతం దేశమంతటినీ కదిలించిందని చెప్పారు. సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు, ఆస్పత్రులలో పని చేసే సిబ్బందికి రక్షణ కల్పించేలా పటిష్టమైన చట్టాలను రూపకల్పన చేయాలని కోరారు. ప్రధానంగా నాలుగేళ్లుగా పెండింగ్ లో ఉన్న సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టును (సీపీఏ) అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, జిఎస్ జె అచ్యుతరావు, కె సత్యాంజనేయ, ఎస్కె రెహమాన్, పి చంద్రశేఖర్, జి.రాంబాబు, కె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలి

రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సోసోడియాకి సీపీఐ విజ్ఞప్తి

విశాలాంధ్ర - విశాఖ : విశాఖ జిల్లాలో అన్యాక్రాంతమైన, కబ్జాలకు గురైన విలువైన ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలని, ఆ భూములను ప్రజల అవసరాలకు ఉపయోగించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సోసోడియాకి సీపీఐ విజ్ఞప్తి చేసింది. విశాఖ కలెక్టరాఫీసులో శనివారం ఆయనకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మరిపిల్ల పైడిరాజు మాట్లాడుతూ విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం పంచాయితీ సర్వే నెంబర్ 187/1లో 4.89 ఎకరాల భూమిని మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కుమారుడు ధర్మాన రాంమనోహర్ నాయిడు మాజీ సైనికుడి పేరున దొంగ పత్రాలు సృష్టించి కబ్జా చేసారని, ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ వ్యవహారం అంతా ధర్మాన ప్రసాదరావు రెవిన్యూ మంత్రిగా ఉన్న సమయంలోనే జరిగిందని తెలిపారు. విశాఖపట్నం రూరల్ మండలం కొమ్మాది పంచాయితీ సర్వే నెంబర్ 28/2లో 10.18 ఎకరాల ప్రభుత్వ భూమిని ధర్మాన ప్రసాదరావు సహాయ సహకారాలతో కె. శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి అన్యాక్రాంతం చేసాడని, ఆ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. విశాఖపట్నం రూరల్ మండలం కొమ్మాది పంచాయితీ సర్వే నెంబర్ 7లో 50 ఎకరాల ప్రభుత్వ భూమిని సత్యం కంప్యూటర్స్ సిస్టర్ సంస్థ అయిన మైటాస్ సంస్థకు కేటాయించారని, ఆ సంస్థ ఇప్పుడు మనుగడలో లేదని, ఆ భూమి నిరుపయోగంగా వుందని, వెంటనే ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. విశాఖపట్నం రూరల్ మండలం కొమ్మాది పంచాయితీ సర్వే నెంబర్ 154/3లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని మిరియాల సుగుణమ్మ అనే వ్యక్తి అన్యాక్రాంతం చేసారని, తక్షణమే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. విశాఖపట్నం రూరల్ మండలం కొమ్మాది పంచాయితీ సర్వే నెంబర్ 161/1లో పదెకరాల ప్రభుత్వ భూమిని బుద్దా మహాలక్ష్మి, వై. పార్వతి తదితరులు దొంగ పత్రాలు సృష్టించి అన్యాక్రాంతం చేసారని, ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. విశాఖపట్నం రూరల్ మండలం పరదేశిపాలెం పంచాయితీ సర్వే నెంబర్ 166/1లో 23 ఎకరాల అన్యాక్రాంతమైన భూదాన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. విశాఖపట్నం రూరల్ మండలం పరదేశిపాలెం పంచాయితీ సర్వే నెంబర్ 132 లో 50 ఎకరాల అన్యాక్రాంతమైన భూదాన భూమిని స్వాధీనం చేసుకోవాలని, విశాఖపట్నం రూరల్ మండలం ఎండాడ గ్రామం సర్వే నెంబర్ 67 లో మాజీ పార్లమెంట్ సభ్యుడు ఎం.వి.వి. సత్యనారాయణ తన బహుళ అంతస్థుల భవనాల రహదారి కోసం చెరువు గర్భాన్ని కలుపుకొని అన్యాక్రాంతం చేసారని, ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. గోపాలపట్నం మండలం నరవ గ్రామ సర్వే నెంబర్ 7లో పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన 42.25 ఎకరాల ప్రభుత్వ భూమిలో భూకబ్జాదారులు సర్వే నెంబర్ 7/4 ఎ3డి గా సబ్ డివిజన్ చేయించి పదెకరాలు అక్రమంగా లే అవుట్ వేసి విక్రయిస్తున్న భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. విశాఖపట్నం రూరల్ మండలం మధురవాడ సర్వే నెంబర్ 331/5లో పదెకరాల విలువైన ప్రభుత్వ భూమిని మదమంచి రామకృష్ణ అనే భూకబ్జాదారుడు స్వాతంత్ర సమర యోధుడు వల్లూరి లక్ష్మణరావు పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసాడని, ఇ భూమిని 10 సంవత్సరాలు పోరాటం చేసి సీపీఐ కాపాడిందని, ఆ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ భూములు అన్యాక్రాంతం చేసిన వారందరినీ, సహకరించిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నెంబర్ 596ని అడ్డం పెట్టుకొని భోగాపురం విమానాశ్రయం పేరుతో అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినవన్నీ రద్దు చేసి, స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్య నారాయణ, షేక్ రెహమాన్, జిఎస్కె. అచ్యుతరావు, పి.చంద్రశేఖర్, ఎన్ నాగభూషణం, ఎం డి బేగం, సీహెచ్ కాసుబాబు పాల్గొన్నారు.

ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - విశాఖ : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు 26 వేల రూపాయలు జీతం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్ జె.అచ్యుతరావు, ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జేడి నాయుడు డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) కేజీహెచ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏఐటియుసి జాతీయ కౌన్సిల్ సమావేశాల పోస్టర్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యర్థాలను తొలగిస్తూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, కానీ వారి శ్రమను ప్రభుత్వాలు సరిగ్గా గుర్తించడం లేదని అన్నారు. అలాగే 1, 2, 3 తేదీలలోజరుగనున్న జాతీయ సమావేశాలను మూడో తేదీన జరిగే బహిరంగ సభను కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కసిరెడ్డి సత్యనారాయణ, షేక్ రెహమాన్, కాసుబాబు, తిరుపతిరావు, పెద్ద సంఖ్యలో కెజిహెచ్ కార్మికులు పాల్గొన్నారు.

బొత్సకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లాల స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణ ను నగరంలో బొత్స నివాసంలో దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీచ్ రోడ్డు ప్రాంతంలో ఆయన నివాసంలో శనివారం ఉదయం బొత్సతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాల పట్ల వాసుపల్లి గణేష్ కుమార్ ఆయనతో కాసేపు ముచ్చటించారు. ఎమ్మెల్సీగా గెలుపొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

వైద్య విద్యార్థుల నిరసన...

సంఘీభావం ప్రకటించిన హోం మంత్రి, ప్రజా సంఘాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : వైద్య విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ విశాఖలో నిరసనలు హోరెత్తాయి. పశ్చిమ బెంగాల్లోని కోల్ కతాలో జూనియర్ వైద్యురాలుపై ఆర్జీ కర్ ఆస్పత్రిలో జరిగిన అత్యాచారానికి వ్యతిరేకంగా నిరసనలు మిన్నంటుతున్నాయి. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వైద్యులు పెద్ద ఎత్తున నిరసనలు నిర్వహించారు. ఈ నిరసన శిబిరానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వచ్చి సంఘీభావం ప్రకటించారు కాసేపు వైద్య విద్యార్థినిలతో ముచ్చటించి ఇలాంటి సంఘటనలు జరగకుండా దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు తగిన జాగ్రత్తలు తీసుకుంటాయన్నారు. అటూ కేజీహెచ్ ఆసుపత్రి తో పాటు అనేక ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ వైద్యులు విధులు బహిష్కరించి నిరసన చేపడుతున్నారు. అత్యవసర సేవల మినహా ఓపి సేవలు శనివారం నిలిచిపోయాయి. వైద్యురాలి పై జరిగిన అఘాయిత్యం కు నిరసనగా ఐఎంఏ 24 గంటల వైద్య సేవలను బంద్ కు పిలుపునిచ్చింది. ఈ నిరసన దీక్షలకు సీపీఐ సహా పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు, మానవ హక్కుల సంఘాలు సంఘీభావంగా ఆందోళన చేపట్టాయి. ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున వినూత్న రీతిలో నిరసనలు తెలియజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు రక్షిస్తున్న వైద్యులకే రక్షణ లేకుండా పోతుందని మండిపడ్డారు. ప్రభుత్వాలు కట్టిన చట్టాలు చేసి తమకు రక్షణ కల్పించాలని నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా వైద్యులంతా డిమాండ్ చేశారు.

విశాఖ ఉక్కుకు మాంగనీషి మైన్స్ లీజ్ పొడిగింపు

విశాలాంధ్ర - కూర్మన్న పాలెం : విజయనగరం జిల్లాలో గర్భం దరి గల గర్భం లో గల మాంగనీస్ లీజులను పొడిగిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 13వ తేదీన అధికార ఉత్తర్వులను జారీ చేసింది. ఈ లీజు2032 వరకు కొనసాగుతుందని తెలిపారు. దీనిపై ఉక్కు పోరాట కమిటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఇదేవిధంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కు ఇతర రా మెటీరియల్స్ కూడా యాజమాన్యం రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సమకూర్చి పరిశ్రమను పూర్తి సామర్థ్యం తో నడిచే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వేంకటాద్రిపై శ్రీ రామాయణ హవణం

విశాలాంధ్ర - పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతి పెందుర్తి వేంకటాద్రిపై 40 రోజుల చాతుర్మాస్య దీక్షలో భాగంగా శనివారం శ్రీ రామాయణ హవణం పూర్తి చేసినట్లు ఆలయ ప్రదానార్చకులు మహర్తి రామానుజాచార్యులు తెలియచేసారు. ఈ సందర్భంగా శ్రీనివాస కల్యాణం, శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ నీలిమ పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు శ్రీనివాసుని దర్శించుకున్నారు.

ఎస్సీల వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విలువలకు తిలోదకాలు

పార్లమెంటు అధికారాలు సుప్రీం కోర్టు తీసుకోవడం అవివేకం

మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకటరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఎస్సీల వర్గీకరణలో సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చిందని, పార్లమెంటు అధికారాలు సుప్రీం కోర్టు తీసుకోవడం అవివేకమని మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకటరావు అన్నారు. పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత మేధావుల ప్రతినిధులు సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అన్యాయమన్నారు. కుల సంఘాల సభకు ప్రధాని హాజరు అయ్యారని, మందా క్రిష్ణ మాదిగ డిల్లీలో కొందరిని కలిసి ఈ తీర్పు వచ్చేలా ప్రయత్నాలు చేసారని ఆరోపించారు. రాజ్యాంగ విలువలుకి తిలోదకాలు ఇచ్చేలా ఈ తీర్పు వుందన్నారు. పార్లమెంటు అధికారాలు సుప్రీం కోర్టు తీసుకోవడం అవివేకమన్నారు. పార్లమెంటుకి తాళాలు వేస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు అధ్యక్షులు ఫౌండర్ కన్వీనర్ బయ్యే మల్లయ్య మాట్లాడుతూ మాలల మీద విషం కక్కుతున్న వారిని తరిమికొట్టాలని, అప్పట్లో దొంగ లెక్కలు చూపారన్నారు. దీంతో న్యాయ పోరాటం చేశామన్నారు. 2004 లో సుప్రీం కోర్టు వర్గీకరణ కేసు కొట్టి వేసిందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఫుల్ బెంచ్ తీర్పు ద్వారా వర్గీకరణ రద్దు చేసే వరకు పోరాటం సాగిస్తామన్నారు. మాల మహానాడు, దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ అంటరాని తనం రూపు మాపడానికి అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారన్నారు. గతంలో ఎందరో మాల మహానాడు కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మళ్ళీ ఉద్యమించాలని పిలుపు ఇచ్చారు. దళిత ప్రజా వేదిక ప్రతినిధి అలీ, హేమసుందర్. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విలువలుకి తిలోదకాలు ఇచ్చేలా వుందన్నారు. ఉప కులాలు మధ్య చిచ్చు పెట్టే వర్గీకరణ వద్దన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు విడసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, ఎమ్. అప్పలరాజు, అనకాపల్లి జిల్లా మెంబర్, విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ పిఒఎ పి. సుధాకర్, బొంత శ్యామ్ రవి ప్రకాష్, సాంబయ్య, వ్యవస్థాపక అధ్యక్షులు, అంబేద్కర్ పోరాట సమితి, బొబ్బిలి, తిరుపతిరావు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.4 లక్షల జరిమానా

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 40 మంది మందు బాబులకు శనివారం భీమిలి 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్ట్ జడ్జ్ సౌజన్య 40 మందికి ఒక్కొక్కరికి 10 వేలు చొప్పున మొత్తంగా 4 లక్షలు అపరాధ రుసుము విధించారని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు.

ఎన్.యు.ఎస్. ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ గీతం సందర్శన

విశాలాంధ్ర - మధురవాడ : ప్రపంచ ప్రఖ్యాత నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ (ఎన్.యు.ఎస్) సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ప్రొఫెసర్ బి.వి.ఆర్.చౌదరి శనివారం తేది.17.08.2024న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. గీతంతో సంయుక్త అధ్యయనాలకు గల అవకాశాలను చర్చించారు. అనంతరం ఎన్.యు.ఎస్. నిర్వహిస్తున్న పరిశోధనలు, వివిధ కోర్సులను గురించి వివరించారు.కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్,.గీతం రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్.వి.ఎస్.వేణుగోపాల్, విశిష్ట ప్రొఫెసర్ బి.వి.ఆర్.టాటా, డాక్టర్ హరిహరపాడి, డాక్టర్ సమంత బెవరా తదితరులుపాల్గొన్నారు.

బొత్సకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల శాసన మండల సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి వర్యులు బొత్స సత్యనారాయణ ను విశాఖపట్నం లోని ఆయన నివాసంలో వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు బెహరా భాస్కర రావు, డిప్యూటీ మేయర్ జియాని శ్రీధర్, మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్, మాజీ శాసనసభ్యులు అన్నం రెడ్డి అదీప్ రాజు, కార్పొరేటర్ ముమ్మన దేవుడు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్త కనబడుట లేదని భార్య ఫిర్యాదు

విశాలాంధ్ర - పీఎం పాలెం : గత కొన్ని నెలలుగా తన భర్త కనిపించట లేదని భార్య పీ.ఎం. పాలెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 11-14-50, డ్రైవర్స్ కాలనీ, కొమ్మాది, మధురవాడ, విశాఖపట్నం నందు నివసిస్తున్న సీపాన జయలక్ష్మి తన భర్త మురళీకృష్ణ (41) ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ ఉంటారని, ఏప్రిల్ నెలలో ఆమె భర్త తన స్వగ్రామం వీరభద్రపురం వెళ్లి ఈ ఏడాది మే 25న ఇంటికి తిరిగి వచ్చాడని, 27న భర్త మురళి కృష్ణ పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లి,ఇంటికి తిరిగి రాలేదని, భర్తకు ఫోను చేయగా అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ లో ఉందని భార్య తెలిపినట్లు పోలీసులు తెలియజేశారు. అతని గురించి ఎన్ని రకాలుగాను వెతికినను ఆమె ప్రయత్నాలు ఫలించలేదని, భర్త కనిపించక పోవడంతో పీ.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ లో మురళీకృష్ణ భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు 08912721333, 9440796060 ఈ నెంబర్లకు తెలియచేయవలసిందిగా కోరారు.

మైనింగ్‌ను రద్దు చేయాలని కోరుతూ రెండవ రోజు సీపీఎం నాయకులు ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర - ఆనందపురం : కుసురువాడ పంచాయతీ ఆనుకొని ఉన్న కొండ మైనింగ్ రద్దు చేయాలని ఆగస్టు 28వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ నీ విరమించు కోవాలని సిపిఎం పార్టీ భీమిలి జోన్ కమిటీ రెండో రోజు కుసలువాడ ఎస్సీ కాలనీ గొల్లలపాలెం, బీసీ కాలనీ, దాసరి కాలనీ, కుసులవాడ, ప్రాంతాల్లో సిపిఎం పార్టీ బృందం పాదయాత్ర చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు, భీమిలి జూన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి ,మాట్లాడుతూ కుసులవాడ పంచాయతీ పరిధిలో ఈ మైనింగ్‌కు అనుమతులు ఇచ్చినట్టయితే ఈ ప్రాంతంలో5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నటువంటి వరి, జీడి, మామిడి, కొబ్బరి పండ్ల తోటలో కూరగాయలు పువ్వులు లాంటి పంటలు పూర్తిగా నాశనం అవుతాయని భూగర్భ జలాలు చెరువులు బోర్లు పూర్తిగా కలుషితమవుతాయని ప్రజలు ఆరోగ్యాలు పూర్తిగా పాడైపోతాయని కిడ్నీ వ్యాధులు గుండె జబ్బులు శ్వాస కోస వ్యాధులు క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఈ మైనింగ్ అనుమతులు రద్దుచేసి ప్రజా సేకరణ వెంటనే విరమించుకోవాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శ జగ్గు నాయుడు ,భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, జూన్ కమిటీ సభ్యులు రవ్వ నర్సింగరావు, ఎస్. అప్పలనాయుడు, వాళ్ల నాగరాజు, సూర్యనారాయణ, కొయ్య గౌరీ స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రక్షా బంధం అన్నా చెల్లెళ్ళ అనుబంధం

సెంచురియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీ.ఎస్.ఎన్.రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : రక్షా బంధన్ పండగ ద్వారా అన్నా చెల్లెళ్ళ అనుబంధం మరింత బల పడుతుందని సెంచురియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీ.ఎస్.ఎన్.రాజు అన్నారు. శనివారం ప్రజాపిత బ్రహ్మకుమారీలు ఆధ్వర్యంలో విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ లో ఏటా బ్రహ్మకుమారి సంస్థ ద్వారా రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండగ ప్రతీకగా నిలుస్తోందన్నారు. బ్రహ్మ కుమారీ సంస్థ ప్రతినిధి బి.కె. రామేశ్వరి మాట్లాడుతూ దుర్గుణాలు, వ్యసనాలకు మానవులు బానిస అవుతున్నారని, ఇతరులను రక్షించలేని స్థితిలో ఉన్నారన్నారు. దేశంలో ఉత్తరాన రాఖీ పౌర్ణమి, దక్షిణంలో జంధ్యాల పౌర్ణమిగా జరుపుకుంటారని తెలిపారు. యుద్ధానికి వెళ్ళే ముందు వీరులకు మహిళలు రక్షా బంధన్ కడతారన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. విజెఎఫ్ మాజీ ఉపాధ్యక్షులు, ప్రముఖ కొరియో గ్రాఫర్ నాగరాజు పట్నాయక్, బ్రహ్మ కుమారీస్ సంస్థ సభ్యులు సిద్దు, సునీత,బి.కే.సత్యవతి, అనూరాధ, భవాని, సుమ, వెంకటరత్నం పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సిబ్బంది నిరసన

విశాలాంధ్ర - పెందుర్తి : కోల్ కతాలో వైద్యవిద్యార్థిని హత్యా కాండలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నాయుడు తోట వద్ద గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిరసన చేపట్టారు. ఆసుపత్రిలో వైద్యసేవలను నిలిపివేసి బాదితురాలికి మద్దతుగా ర్యాలీ నిర్వహించి నినాదాలు చేసారు. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి జనరల్ మేనేజర్ కే. బంగార్రాజు మీడియాతో మాట్లాడుతూ శ్రీకాకుళం, మద్దిలపాలెం, గాజువాక, నాయుడుతోట ఆసుపత్రులలో అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని సేవలను 24 గంటలు పాటు నిలిపివేసినట్లు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ట్రస్టీ ఆత్మకూరి క్రుష్ణకుమారి, ఆసుపత్రి వైద్యులు డా.రవీంద్ర, డా. క్రుష్ణ, డా.శిరీష, డా. సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

బీవీ పద్మాన్ని ఘనంగా సన్మానించిన ఉక్కు నిర్వాసిత నాయకులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ : విశాఖ పోలీస్ గ్రౌండ్లో జరిగిన 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చేతుల మీదుగా గాజువాక సర్కిల్ 3 సివిల్ సప్లై డిపార్ట్మెంట్లో సీనియర్ చెకింగ్ ఇన్స్పెక్టర్గా పని చేస్తున్న బీవీ పద్మ ప్రశంస పత్రం పొందడం పట్ల ఉక్కు నిర్వాసితుల నాయకులు పులి వెంకట రమణారెడ్డి బలిరెడ్డి సత్యనారాయణ ఘనముగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణగా అంకిత భావంతో విధి నిర్వహణలో పని చేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని అన్నారు. బీవీ పద్మ మాట్లాడుతూ నాకు ప్రశాంతత రావడానికి నా ఉన్నత అధికారులు నా సహచర ఉద్యోగులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఉక్కు నిర్వాసిత నాయకులు బొట్ట అచ్చారావు ములకపల్లి పెంటారావు దొమ్మేటి అప్పారావు నీలాపు అప్పల రెడ్డి ముద్దర్తి సాంబ బి తేజ రెడ్డి గుజ్జు సందీప్ రెడ్డి కేత రాజు పాల్గొన్నారు.

మత్తు మాదకద్రవ్యాల నిర్మూలనకు ఉపాధ్యాయులంతా బాధ్యతగా కృషి చేయాలి : డీఈవో చంద్రకళ

విశాలాంధ్ర - సింహాచలం : గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ పరిధి అడవివరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో భీమిలి నియోజకవర్గంలో పని చేయుచున్న బయాలజీ, వ్యాయామ ఉపాధ్యా యుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారిని ఎల్ చంద్రకళ హాజరై ఉపాధ్యాయులకు వారి విధి నిర్వహణ పట్ల చిత్తశుద్ధితో ఉండాలని విద్యార్థుల విద్యా ప్రమాణాలను తరగతికి అనుగుణంగా పెంచాలని అన్నారు. క్రమశిక్షణతోను విలువలతోనూ కూడిన విద్యను మాత్రమే విద్యార్థులను ఉన్నత స్థితికి తీసుకు వెళ్లగలవని ఆదిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ ఉపాధ్యాయులనుద్దేశించి ప్రధానోపాధ్యాయులు ఇమంది పైడిరాజు మాట్లాడుతూ క్రమశిక్షణతోను విలువలతోనూ కూడిన విద్యను మాత్రమే విద్యార్థులను ఉన్నత స్థితికి తీసుకు వెళ్ళగలవని ఆదిసగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వేరువేరు కుటుంబ నేపథ్యం కలిగి చెడు సావాసాలకు లోనై గంజాయి మత్తు మాదకద్రవ్యాలు వంటి వ్యసనాలకు బానిసవుతున్నారని అందుకే ప్రభుత్వము తీసుకుంటున్న చర్యలకు ఉపాధ్యాయులు పోలీస్ శాఖ వారితో పాటు కృషి చేయాలని అన్నారు. ఈ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన గోపాలపట్నం ఎస్సై నాయుడు మాట్లాడుతూ, సమాజాభివృద్ధికి శాంతి, సామరస్యాలకి, ప్రశాంతమైన జీవితాలకు మాదకద్రవ్యాలు అభివృద్ధి నిరోధకాలుగా ఉన్నాయని, వాటిని పూర్తిగా సమాజం నుండి నిర్మూలించినప్పుడే సమాజంలో శాంతి, అభివృద్ధి సాధ్యమని అన్నారు. విద్యార్థులు ఎక్కువమంది ఇటీవల కాలంలో చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారని, అందుకే ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణలో మాదకద్రవ్యాలను నిర్మూలించాలనే లక్ష్యంతో పోలీస్ శాఖతో పాటు ఉపాధ్యాయులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ పాఠశాల ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు సి హెచ్ రవికుమార్, పిరాము,అప్పుజు, లలిత్ కుమార్, రామచంద్ర నాయుడు, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని హంతకులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - అనందపురం : కోల్ కత్తా ఆర్జికె మెడికల్ కాలేజ్ పీజీ రెండో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థిపై లైంగిక దాడికి పాల్పడిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మరల జరగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను తీసుకొచ్చి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నిరసన చేపట్టారు అందులో భాగంగా శనివారం మండలంలో బంటుపల్లి వారి కల్లాలు డాక్టర్ లక్ష్మణ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సుమారు 500 మంది కళాశాల విద్యార్థులతో వేములవలస జంక్షన్ వరకు ప్లకార్డులతో డాక్టర్లు నర్సులు పెద్ద ఎత్తున భేటీ పడాయ్ బచ్చాయ్ నహి అనే నినాదంతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం భారీ ర్యాలీతో చేపట్టారు.కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ త్రినాథ రావు, డాక్టర్ యమున,వివేకానంద కళాశాల కరస్పాండెంట్ నాయుడు, ప్రిన్సిపాల్ మీసాల అప్పలరాజు, భూషణ్, హాస్పిటల్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జీవియంసి, రెవిన్యూ అధికారుల సమన్వయంతో భూ సమస్యలకు పరిష్కారం..

భూఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపడతాం..

రాష్ట్ర రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా..

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జిల్లాలోని జీవియంసి, మునిసిపాలిటీ, రెవిన్యూ అధికారుల సమన్వయంతో భూసమస్యలకు పరిష్కారం చూపుతామని రాష్ట్ర రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ యం.ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తో కలిసి శనివారం జిల్లాలోని పలు ప్రాంతాలను ఆయన పర్యటించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూసమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాలను పర్యటించి, కొన్ని వివాదస్పద భూములను పరిశీలించామని, ఎర్రమట్టి దిబ్బలను సందర్శించామని తెలిపారు. విశాఖ భూములపై చాలాకాలం నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, దశాబ్దాల తరబడి ఫిర్యాదులతో పాటు కోర్టు కేసులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చాయని అన్నారు. విశాఖ విస్తరణ చెందడం, భోగాపురం ఎయిర్ పోర్టు రావడం వలన విశాఖలో భూముల ధరలు అమాంతంగా పెరిగాయన్నారు. దీనివలన చాలా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి, వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. అసైన్డ్, డి- పట్టా భూములను ఫ్రీహోల్డ్ చేయడం, వాటిని రిజిస్ట్రేషన్ చేయడం వంటివి జిల్లాలో ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. 2,600 ఎకరాలు ఫ్రీహోల్డ్ అవకాశాలున్న భూములు జిల్లాలో ఉండగా, వాటిలో 626 ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్ చేసి 22ఎ నుంచి ఆ భూములను తీసివేయడం జరిగిందని చెప్పారు. వాటిలో 133 ఎకరాలు కొత్త వారి పేరు మీద రిజిస్ట్రేషను అయిందని, సుమారు 4 మండలాల్లో ఇటువంటి పరిస్థితులు ఉన్నట్లు ఆయన తెలిపారు. భూసమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రజలకు ఒక అవకాశం కల్పించామని, పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసామన్నారు. తద్వారా సమస్యలు విని, ఆ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోబోతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో అనధికార లేఅవుట్లు చాలా వరకు వచ్చాయని, భవన యజమానులు, డెవలపర్స్ చదరపు గజాల ధరలకు వాటిని విక్రయిస్తున్నారని చెప్పారు. లేఅవుట్లకు సంబంధించిన అప్రూవల్స్ ఉన్నదీ లేనిదీ పరిశీలించి రిజిష్టర్ చేసే పద్ధతి గతేడాది వరకు సబ్ రిజిష్టరు కార్యాలయాల్లో ఉండేది కాదని, ప్రస్తుతం నూతన విధానం వలన ఇటువంటి సమస్యలకు చెక్ పెట్టనున్నట్లు చెప్పారు. వ్యవసాయ భూములు రెసిడన్షియల్ ఏరియా అవుతుందని, కమర్షియల్ కాబోదని, అటువంటి సమస్యలు కూడా తమ దృష్టికి వచ్చాయని, ప్రభుత్వ ఉద్యోగులు సైతం సమస్యలతో వచ్చినట్లు చెప్పారు. భూములకు సంబంధించిన అన్ని సమస్యలతో పాటు రీసర్వే జరిగిన చోట్ల కూడా కొన్ని సమస్యలు వచ్చాయని, వాటిని అందరి సహకారంతో పరిష్కరించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఎర్రమట్టి దిబ్బల్లో కొంతవరకు భూమిని చదును చేసారని, తర్వాత జిల్లా యంత్రాంగం తెలుసుకొని ఆ పనులను నిలిపివేసిందని తెలిపారు. ఎటువంటి నిర్మాణ పనులు అక్కడ చేపట్టడానికి అనుమతులు ఇవ్వలేదని, ప్రస్తుతం స్టేటస్ కో మీద నడుస్తుందని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధాన మిచ్చారు. దసపల్లా ఎస్టేట్ భూములపై కోర్టు కేసులున్నాయని, వాటిని పరిష్కరించుకోవాల్సి ఉందని, 60 ఎకరాల భూమిలో 14.5 ఎకరాలను ప్రభుత్వ భూమిని 22ఎ లో పెట్టడం జరిగిందని అన్నారు. మిగిలిన భూమిని ఏ విధంగా పరిష్కరించాలనే విషయంపై మార్గాలను వెతుకుతున్నట్లు చెప్పారు. సెటిల్ మెంట్ ఆఫీసర్ ఎస్టేట్ భూములపై ల్యాండ్ రెంట్ పట్టా ఇచ్చారని, వాటిని కూడా క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. విశాఖ అర్బన్ జిల్లా కావడంతో అర్బన్ ప్రాంతంలోని భూసమస్యలే ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. త్వరలో జీవియంసి, మునిసిపాలిటీ, రెవిన్యూ అధికారుల సమన్వయంతో భూసమస్యల పరిష్కారానికి మార్గాలు దొరుకుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ మూడు మాసాల్లో భూములను ఫ్రీహోల్డ్ చేయడానికి వీల్లేదని చెప్పడం జరిగిందని, అలాగే 22ఎ లో నుంచి తీయడానికి వీల్లేదని ఆదేశాలు జారీచేసామని, అయినప్పటికీ అటువంటివాటిపై ఫిర్యాదులు వస్తే వాటిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. రెవిన్యూ, జీవియంసి, మునిసిపల్ శాఖలు సమన్వయం చేసుకొని, సర్వే నెంబర్లు సరిచూసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములు కాపాడుకోవాలనేదే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో సిటీ మ్యాప్ తయారుచేసి, ప్రభుత్వ, ఇతర భూములను, రోడ్లు , పార్కులు ఇలా అన్నిరకాల వాటిని రంగులతో చూపడం ద్వారా భవిష్యతులో ఆక్రమణలకు ఆస్కారం ఉండబోదని అభిప్రాయపడ్డారు. గత మూడు రోజులుగా ఉత్తరాంధ్రలో పర్యటించామని, చాలా చోట్ల భూఆక్రమణలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై ఫిర్యాదులపై అందాయని, త్వరలో వాటిపై చర్యలు చేపడతామని స్పష్టం చేసారు.

22న ఉత్తరాంధ్ర జానపద జాతర కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఆగష్టు 22 గురువారం విశాఖ లో భారీ ఎత్తున ఉత్తరాంధ్ర జానపద జాతర ను రైటర్స్ అకాడమీ నిర్వహిస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమానికి నగరం లోని అన్ని కళా సంస్థలూ భాగస్వామ్యం అవుతున్నాయి. రాష్ట్ర సాంస్కృతిక, టూరిజం, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కందుల దుర్గేష్, ప్రముఖ సినీ నటులు బ్రహ్మానందం ఈ కార్యక్రమం లో పాల్గొనేందుకు, ఉత్తరాంధ్ర కళాకారులకు ఆశీస్సులు అందించేందుకు విచ్చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బీచ్ రోడ్డు లోని సీఎంఆర్ విశ్వ ప్రియా ఫంక్షన్ హాల్ నుంచి సుమారు మూడు వేల మంది కళాకారులు ర్యాలీగా బయలుదేరి సిరిపురం దగ్గరి గురజాడ కళాక్షేత్రం వద్దకు చేరుతారు. సాయంత్రం 4 గంటల నుంచి ఉత్తరాంధ్ర జానపద కళా రీతుల ప్రదర్శనలు మొదలవుతాయి. ఈ కార్యక్రమం లో ఉత్తరాంధ్ర లోని మన్యం ప్రాంతం తో సహా అన్ని ప్రాంతాల నుంచీ కళాకారులు తమ తమ ప్రదర్శన లతో పాల్గొనబోతున్నారు. ఉత్తరాంధ్ర కళా రీతులైన చిన్న తాళం భజన, చెక్క భజన, పులివేశాలు, కర్ర సాము, కత్తి సాము, తూర్పు బాగోతం, సవర అగం దిమ్మేసా నృత్యం, ఆదివాసీ కోందు దిమ్మసా నృత్యం, పొడుగు కాళ్ళు, జాలరి నృత్యం, రైతు నృత్యం, జముకు ఇలా ఎన్నో ఉత్తరాంధ్ర జానపదాలతో పాటు ఏపీ సృజనాత్మక, సాంస్కృతిక శాఖ సహకారంతో పిట్టల దొర, గరగ నృత్యం, బుట్ట బొమ్మలు, కీలు గుర్రం, డంఖాలు ఈ కార్యక్రమం లో పాల్గొంటాయి. మరో ప్రత్యేకత ఏమిటంటే తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ 20 మంది మహిళా డప్పు కళాకారులను, 22 మంది ఒగ్గుడోలు నృత్య బృందాన్ని పంపుతోందని తెలిపేందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము. ఈ కార్యక్రమం లో కళాకారులను ఆశీర్వదించేందుకు ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, హోం మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత, విజయనగరం ఎంపీ కే. అప్పలనాయుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, గణబాబు, పంచకర్ల రమేష్ బాబు, విష్ణుకుమార్ రాజు, వంశీ కృష్ణ యాదవ్ విచ్చేయు చున్నారు. ఉత్తరాంధ్ర జానపద కళలను ప్రపంచానికి మరింత దగ్గర చేసేందుకు చేస్తున్న ఈ చిన్న ప్రయత్నానికి మీడియా మిత్రులు సహకరించి ప్రోత్సహించాలసిందిగా కోరు కుంటున్నాము. ఉత్తరాంధ్ర కళా ఖ్యాతిని మరింత శిఖరాగ్రానికి చేర్చేందుకు మీ సంపూర్ణ సహకారం అందిస్తారాని ఆశిస్తున్నామని ఉత్తరాంధ్ర జానపద జాతర నిర్వాహక కమిటీ తరపున వి. వి. రమణమూర్తి, ఛైర్మన్, రైటర్స్ అకాడమీ తెలిపారు.

కొవ్వొత్తులతో ఐద్వా నిరసన

విశాలాంధ్ర - పెందుర్తి : పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తాలో జూనియర్ మహిళా డాక్టర్ పై జరిగిన అత్యాచారం, హత్యను ఐద్వా పెందుర్తి జోన్ కమిటీ తీవ్రంగా ఖండించిది. ఈ మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పెందుర్తి రైతు బజారు వద్ద కొవ్వత్తులతో నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా నాయకులు బి. రమణి మాట్లాడుతూ ఈ ఘటన మరో నిర్భయగా పేర్కొనవచ్చునని, ఈ ఘటన దేశాన్ని మరొక్క సారి ఉలిక్కిపడేలా చేసిందన్నారు. అతి కిరాతకంగా దుండగులు ఆమెను సామూహిక అత్యాచారం చేసి,హత్య చేయటం అనేది అత్యంత పాశవిక చర్య అని ఆవేదన వెలిబుచ్చారు. హాస్పటల్స్ అంటే దేవాలయాలుగాను, డాక్టర్స్ అంటే దేవుళ్ళుగాను భావిస్తామని, అటువంటి డాక్టర్లకే రక్షణ లేనప్పుడు సామాన్య మహిళలకు రక్షణ ఎక్కడ ఉంటుందని మహిళా లోకం ఘోషిస్తుందని పేర్కొన్నారు. 78 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో రోజుకి 87 మంది మహిళలపై అత్యాచారాలు, హత్యలు నమోదవు తున్నాయని, అంటే భరతమాత ఎటు వెళు తుందని విస్మయం వ్యక్తం చేశారు నిర్భయ ఘటన తరువాత వర్మ కమిషన్ సిఫార్సులు ప్రక్కకు నెట్టి వేయబడ్డాయని, మహిళా రక్షణకు ఏ ప్రభుత్వాలకు కూడా చిత్తశుద్ధి లేదని రమణి మండిపడ్డారు. బెంగాల్లో మమతా బెనర్జీ ప్రభుత్వం, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జోక్యం చేసుకొని సిబిఐ నిష్పక్ష పాతంగా దర్యాప్తుచేయాలని, హంతకులు ఎంతటి వారైనా వెంటనే అరెస్టు చేసి మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు,

రవీంద్రభారతిలో ఘనంగా అగ్రినోవా అగ్రికల్చరల్ ఫెస్ట్

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనంద పురం రవీంద్ర భారతి పాఠశాలలో అగ్రి నోవా (అగ్రి కల్చరల్ ఫెస్ట్) కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిధిగా విశాఖ పట్నం జిల్లా వ్యవ సాయాధి కారి కె.అప్పల స్వామి మాట్లాడుతూ వ్యవసాయం మానవ చరిత్రలో అతిపెద్ద అంశం అని ,ప్రపంచవ్యాప్త సామాజిక ఆర్థిక ప్రగతిలో వ్యవసాయ అభివృద్ధి ఒక కీలక అంశం అని ,ఒక నిర్దిష్టమైన పద్ధతిలో మొక్కలను ,జంతువులను పెంచి పోషించి తద్వారా ఆహారాన్ని మేత ,నార,ఇంధనాన్ని ఉత్పత్తి చేయడమే వ్యవసాయం యొక్క ముఖ్య లక్ష్యమని అన్నారు .విశిష్ట అతిథిగా విచ్చేసిన ఏ మోహనరావు దేశానికి వ్యవసాయం వెన్నెముక వంటిదని దాన్ని పండించే రైతు దేశానికి ఆదర్శమని అన్నారు.పాత వ్యవసాయ పద్ధతులనే కాకుండా కాలంతో పాటు మారి కొత్త వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఎంతో పురోగతిని సాధించవచ్చు అని తెలిపారు. తయారుచేసిన వ్యవసాయ నమూనాలు ప్రకృతివ్యవసాయం, నీటిశుద్ధి, ప్రత్తి పట్టుపరిశ్రమలు, సుగంధద్రవ్యాలు, తేనెటీగల పెంపకం, డైరీ, కోళ్లపెంపకం, రైతుబజార్ తదితరాలను పరిశీలించి వారి సృజనాత్మకతను, ప్రతిభను ఎంతగానో కొనియాడారు.కార్యక్రమంలో నార్త్ ఆంధ్ర జోనల్ ఇంచార్జ్ ఎన్ .వెంకటేష్, సి.జి.ఎంజి.ఆర్. వసంత, పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. ఉమా మహేష్, విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు తయారుచేసిన నమూనాలు ఆహుతులను ఎంతగానో ఆకర్షించాయి.

జలగెడ్డ స్మశానవాటిక కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

జోనల్ కమీషనర్‌కి మత్స్యకారులు వినతి

విశాలాంధ్ర - భీమిలి : భీమిలి జోన్ 3వ వార్డులో ఉన్న జలగెడ్డ స్మశానవాటిక స్థలాన్ని కొంతమంది వ్యక్తులు కబ్జాచేసి మా మనోభావాలు దెబ్బతీస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని భీమిలి జోనల్ కమీషనర్ కనకమహాలక్ష్మికి ఎగువపేట గ్రామాభివృద్ధి సేవాసంఘం సభ్యులు వినతిపత్రం ద్వారా కోరారు. శనివారం జలగెడ్డ స్మశానవాటికపై జోనల్ కమీషనర్ కి సంఘ సభ్యులు, గ్రామపెద్దలు కలసి వివరించారు. సముద్ర తీరాన్ని ఆనుకొని మత్స్యకారుల స్మశానవాటికలు ఉంటాయని అన్నారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం నుండి కూడా ఇదే ఒరవడిక ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఉండే 9 జిల్లాల్లో కూడా మత్స్యకారుల యొక్క స్మశానవాటికలు ఇలానే ఉంటాయని చెప్పారు. స్మశానవాటికలను మత్స్యకారులు దైవమందిరాలుగా బావిస్తారని అన్నారు. అలాంటి స్మశానవాటికలను కొంతమంది వ్యక్తులు కబ్జాలు చేస్తున్నారని అన్నారు. రోడ్డు ప్రక్కన హెూటల్ నిర్మించి వ్యాపారం చేసుకొనే సదరు వ్యక్తి హెూటల్ వెనుక ఉండే స్మశానవాటికను కూడా హెూటల్లో భాగంగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. తీరంలో ఉండే ఏ స్మశానవాటికకు కూడా ప్రహరీ గోడలు ఉండవని తెలియజేసారు. హెూటల్ నిర్వాహకులకు జీవిఎంసీ అధికారులు వత్తాసు పలికేవిధంగా ఇచట పార్థివదేహాలను ఖననం చేయకూడదని నోటీసుబోర్డులు పెట్టడం మరీ విడ్డురంగా ఉందని అన్నారు. సి ఆర్ జెడ్ జోన్లో అదీకూడా నో డెవలప్మెంట్ జోన్లో హెూటల్ నిర్మించాడని అన్నారు. జీవిఎంసీ అప్రూవల్ లేదు, వుడా అనుమతులు లేవు, బిల్డింగ్ ప్లాన్ కూడా లేకుండా ఇన్ని రకాలుగా సదరు హెూటల్ వ్యక్తి అక్రమాలకు పాల్పడినా ఎందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని ప్రశ్నించారు. మా మత్స్యకారుల యొక్క మనోభావాలతో అధికారులకు సంబంధం లేదా..? అని అన్నారు. దయచేసి అక్రమకట్టడాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని, మత్స్యకారులకు తగిన న్యాయం చేయాలని, అదేవిదంగా హై కోర్టు ఉత్తర్వులు వచ్చేంతవరకు స్మశానవాటికలు జీవిఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన నోటీసుబోర్డులను తొలగించవలసినదిగా కోరామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి సేవాసంఘం అధ్యక్షులు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు, కోశాదకారి బర్రి కొండబాబు, మైలపల్లి షణ్ముఖరావు, వాసుపల్లి కొండబాబు , కారి చిన్న సభ్యులు పి. నర్సింగరావు, ఎమ్. ధనరాజు, ఎమ్ కొండ, వి. అప్పన్న, ఎస్. శ్రీను మరియు ఇతర సంఘ సభ్యులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఇతర దేశాలతో భారత్ సత్సబంధాలు కలిగి ఉండాలి : ఆచార్య కె.ఎస్.చలం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : భారత దేశం ఇతర దేశాలతో సత్ సంబంధాలు కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, యూపీఎస్సీ పూర్వ సభ్యులు, పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ఎస్.చలం అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయు డబ్ల్యూజే) 67వ వార్షికోత్సవాలు పురస్కరించుకొని లిపొరుదేశాల్లో యుద్దాలు - భారత్ పై వాటి ప్రభావంలి అనే అంశంపై ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య చలం మాట్లాడుతూ భారత దేశం అలీన విధానాన్ని పాటించి ఇతర దేశాలతో సత్ సంబంధాలు కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇతర దేశాల్లో దాదాపు 2 కోట్ల మంది భారతీయులు ఉన్నారని వారి ద్వారా జాతీయ ఆదాయంలో సుమారు 4 శాతం సమకూరుతుందని వివరించారు. సౌదీ అరేబియా, దుబాయ్ వంటి దేశాల్లో మధ్యతరగతికి దిగువన ఉన్న వారు ఎంతోమంది కార్మికులుగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా దేశాలతో సత్సంబంధాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత లేదని కనీ అవసరాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలపై ఈ కార్యక్రమంలో ఇస్మాఫ్ రాష్ట్ర అధ్యక్షులు జే.వి.ప్రభాకర్ మాట్లాడుతూ యుద్ధ ప్రభావాలు వలన ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్దాల వలన చమురు ధరలు పెరిగాయన్నారు. వేలాదిమంది అనాద లుగా మారి గుడారాల్లో బతుకుతున్నారన్నారు. వారికి సరైన ఆహారం కూడా అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా ప్రతినిధి ఆచార్య ప్రియాంక మాట్లాడుతూ యుద్ధం వద్దు - శాంతే ముద్దు అనే నినాదంతో భారత్ ముందుకెళ్ళాల్సి ఉందన్నారు.అమెరికా సామ్రాజ్య వాద ధోరణితో ఉక్రెయిన్ పాలస్తీనాలు బలిపశువుగా మారాయన్నారు. గ్లోబల్ వార్మింగ్ కు యుద్ధాలే కారణం అన్నారు. స్టేట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (సామ్నా) రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు మహాత్మాగాంధీ, నెహ్రూ లు స్వాతంత్ర్యం సాధించడమే లక్ష్యంగా పత్రికలు పెట్టారన్నారు. ప్రస్తుతం భారత దేశం లో మీడియా స్వేచ్ఛ దారుణంగా ఉందన్నారు. పొరుగు దేశాల కంటే మీడియా స్వేచ్ఛ విషయం లో దిగజారి ఉన్నామని తాజా సూచికలు తెలియ జేస్తున్నాయన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదన్నారు. ఈ కార్యక్రమంలో బిగ్ టీవీ చీఫ్ న్యూస్ ప్రెజెంటర్ నాగరాజు. ఈ ఏపీయూడబ్ల్యూజే విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కే.రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్ర రావు, కోశాధికారి కిల్లి ప్రకాశరావు, ఉపాధ్యక్షులు కే.చంద్రమోహన్, మెట్ట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే విశాఖపట్నం జిల్లా కార్యవర్గం, అనుబంధ ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం, సామ్నా కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వాల్మీకి నాగరాజ్, ప్రధాన కార్యదర్శి చందు యాదవ్ ఇతర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల నుండి బంగారు ఆభరణాలు రికవరీ..

క్రైమ్ డిసిపి వెంకటరత్నం..

విశాలాంధ్ర - పీఎం పాలెం : రికవరీ సొత్తును స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు క్రైమ్ డిసిపి పి వెంకట రత్నం తెలిపారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ 6 న పిఎం పాలెంలో ఆర్ హెచ్ కాలనీలో దొంగతనం జరిగిందని, అర్ధరాత్రి ఈ దొంగతనం జరిగిందని 112 కు ఫోన్ అవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారన్నారు. అనేక కోణాల్లో ఈ కేసును దర్యాప్తు చేశామని, అయితే ఈ చోరీ విషయమై అదే కాలని కి సంబంధించి ముగ్గురును అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారి నుండి దొంగలింపబడిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తప్పుగా సమాచారం ఇస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని, సరైన పద్దతిలో ఈ కేసును దర్యాప్తు చేశాం అన్నారు. అయితే కొద్ది కాలం క్రితం పనోరమా హిల్స్ లో జరిగిన చోరీలో సుమారు 1040 గ్రాములు బంగారం, 20 లక్షలు డబ్బు పోయిందని, ప్రతి ఇంటికి సీసీ కెమెరా తప్పనిసరి అని, అదే కాలని ఐతే అందరు కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు దొంగతనాలు జరిగిన చోట తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీపీ ఆదేశాలు జారీ చేశారన్నారు.

గొర్లెవాని పాలెంనకు దారి కోసం జీవిఎల్‌కు వినతి

విశాలాంధ్ర - పెందుర్తి : జీవిఎంసీ 96వ వార్డు గొర్లెవాని కాలనీకి దారి మూసుకు పోకుండా రైల్వే అధికారుల నుండి అనుమతి ఇప్పించాలని భారతీయ జనతాపార్టీ నియోజక వర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు అద్వర్యంలో కాలనీ వాసులు మాజీ రాజ్య సభ సభ్యులు జీవిఎల్ నరసింహారావుకు వినతిపత్రం అందచేసారు. పెందుర్తి నియోజకవర్గంలో రైల్వే లైనుకు ఇరువైపులా రైల్వే అధికారులు ప్రహరీ గోడ నిర్మిస్తుండటంతో కాలనీకి వెళ్లే దారి కంప్లీట్ గా మూసుకుపోయే అవకాశం ఉంది. ఆరోడ్డు మొత్తం రైల్వే స్థలంలో ఉండడంతో కాలనీవాసులు చేసేదేమిలేక రామునాయుడుకు సమస్యను వివ రించారు. దీంతో రామునాయుడు ఆ కాలనీని పరిశీలించి సమస్యను జీవిఎల్ ద్రుష్టికి తీసు కెళ్లారు. దీనిపై స్పందించిన జీవిఎల్ రైల్వే వారితో మాట్లాడి సమస్యకి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చినట్లు రామునాయుడు మీడియాకు వివరించారు.

పిల్లలకు మత్తు ఔషదాలు విక్రయిస్తే కఠిన చర్యలు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : పిల్లలకు మత్తు ఔషదాలు విక్రయించే ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వానికి, విశాఖ జిల్లా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు వివిధ సిఫారసులు చేసేందుకు వెనుకాడమని, నిర్విరామంగా డేగ కళ్ళతో పర్యవేక్షణ జరుపుతున్నట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు,సభ్యులు గొండు సీతారాంలు అన్నారు. సూర్యబాగ్ జీవీఎంసీ జోన్ 4 కార్యాలయ సెమినార్ హాల్లో శనివారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపి ఎస్సిపిసిఆర్), విశాఖ జిల్లా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌ల సంయుక్త ఆధ్వర్యాన బాలలకు మత్తు ఔషదాల నియంత్రణలో జిల్లా మందుల దుఃఖానాల యజమానులతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపి ఎస్సిపిసి ఆర్) చైర్ పర్సన్ కేసలి అప్పారావు,సభ్యులు గొండు సీతారాంలు మాట్లాడుతూ పెద్దల తోడు లేకుండా,అలాగే వైద్యుల సిఫార్సు చీటీలు లేకుండా వచ్చే పిల్లలకు కోరెక్స్ వంటి దగ్గు మందులు,ఆల్ప్రాజోలం 0.25,0.5 ఎం.జి.బెంజోడియా జెపినిస్, డయా జెపం,నైట్రా జెపం,ఆల్ప్రెక్స్ 0.25,రెస్టిల్ 0.25 వంటి ఔషదాలె కాకుండా ఒపియోయిడ్స్,మోర్ఫియిన్,కోడైన్, ఫెంటాలైనేటిక్ వంటి మత్తు ఇంజక్షన్లు అమ్మకం చట్ట విరుద్ధం అయినప్పటికీ వీటిని విక్రయిస్తున్నట్టు తమ కమిషన్ కు ఎన్నో ఫిర్యాదులు అందుతున్నాయి అన్నారు. జిల్లా ఔషధ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు సూచనలతో అన్ని మెడికల్ దుఖానాల వద్ద సిసి కెమెరా వ్యవస్థలు ఏర్పాటుతో పాటు బాలలకు మత్తు ఔషదాలు అమ్మకం జరపబోమని ప్రతీ షాప్ ఎదుట అందరికీ కనిపించేలా ప్రత్యేక స్టిక్కర్లు,బోర్డులు అతికించేందుకు చర్యలు చేపడతామని అన్నారు, జిల్లా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ రూపొందించిన బాలల బంగారు భవితకు డ్రగ్స్ శాఖ చేయూత పేరిట రూపొందించిన కర పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐ.సి.డి.ఎస్.ప్రోజెక్ట్ డైరెక్టర్ జయదేవి,జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మీ,జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు మండ రజని, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఇన్స్పెక్టర్లు ఎం.శ్రీనివాసరావు(సే ల్స్),వి.అభిప్రియారావు(మాన్యుఫాక్చరింగ్),శ్రీమతి కూన కళ్యాణి,విశాఖ నగరానికి చెందిన సుమారు రెండు వందల మంది డ్రగ్గిస్ట్, కెమిస్ట్‌లు పాల్గొన్నారు.

సిట్రియోన్ బసాల్ట్ విడుదల

విశాలాంధ్ర/విశాఖపట్నం : సిట్రియోన్ బసాల్ట్‌ని ప్రవేశపెట్టింది సిట్రియోన్ ఇండియా బసాల్ట్ లాంచ్‌ని ప్రకటిస్తూ భారత దేశంలో మొదటి ముఖ్య విభాగ ఎస్‌యువి కూప్‌ని చక్కగా మెర్జ్‌చేసి ఎస్‌యువికి మెరుగైన, చక్కని రిఫైన్మెంట్‌ని కూప్‌కి అందిస్తుందని ప్రకటించింది. సిట్రియోన్ బసాల్ట్ అద్భుత డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుంది. అది ఎక్కడా చూడని విలాసవంతమైన, ఏరో డైనమిక్ సిల్హౌట్‌ని అందిస్తుంది. సిట్రియోన్ ఆధునీకరణ, సౌకర్యానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. అది 100 సంవత్సరాల వారసత్వాన్ని హాల్ మార్క్‌గా కలిగి ఉంది. బసాల్ట్ కొత్త తరం ఆటోమోటివ్ అనుభవాన్ని అందిస్తుంది. అది మెరుగైన ఫీచర్స్ మీద ఎక్కువ దృష్టి పెడుతూ చక్కని డ్రైవింగ్ అనుభవాన్ని అందిస్తుంది. బసాల్ట్ డెలివరీలుసెప్టెంబర్, 2024 మొదటి వారం నుంచి మొదలవుతాయి. దేశంలో ఉన్న 85 లామైసన్ సిట్రియోన్ ఫైటిగల షోరూంస్‌లో అందుబాటులో ఉంటాయి. వీటి ధర రూ.7,99,000 నుంచి రూ. 13,62,000 వరకు ఉంటుంది.

అక్రమ పొగాకు వ్యాపారం నుంచి విముక్తి కల్పిస్తామని ఐపిఎం ఇండియా హామీ

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్, భారతదేశ అనుబంధ సంస్థ, ఐపిఎం ఇండియా, భారతదేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు వినియోగదారులను రక్షించేందుకు అక్రమ పొగాకు వ్యాపార నిరోధానికి తన నిబద్ధతను బలపరుస్తుందని ఐపీఎం ఇండియా నవనీత్ కర్ చెప్పారు. అక్రమ పొగాకు వ్యాపారం ప్రపంచవ్యాప్తంగా పెద్ద ముప్పుతో పాటు ఇది నానాటికీ వృద్ధి చెందుతున్న సవాలు. భారతదేశంలో ఇటీవలి ఏడాదుల్లో అక్రమ విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ఇటువంటి అక్రమ విక్రయాలు కాలక్రమేణా పెరుగుతూనే ఉన్నాయి. అలాగే, 2022 ఫిక్కి క్యాస్కేడ్ అధ్యయనం ప్రకారం, భారతదేశంలో అక్రమ సిగరెట్ల మొత్తం మార్కెట్ రూ. 22,930 కోట్లుగా అంచనా వేయబడింది. నివేదికల ప్రకారం, ప్రభుత్వానికి ఇది భారీ నష్టం. పొగాకు పరిశ్రమలో అక్రమ మార్కెట్టు 2022 నాటికి భారతదేశంలో రూ.13,331 కోట్లు కాగా, ఇది 2012లో ?6,240 కోట్లుగా ఉంది. అప్పటితో పోల్చితే ఇది 46 శాతం పెరిగింది. టుబాకో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రకారం, అంతర్జాతీయంగా అక్రమంగా రవాణా చేయబడిన, స్థానికంగా తయారు చేయబడిన పన్ను-ఎగవేత సిగరెట్‌లతో కూడిన అక్రమ సిగరెట్ వ్యాపారం భారతదేశంలోని సిగరెట్ పరిశ్రమలో నాలుగింట ఒక వంతు వాటా కలిగి ఉంది.

బీచ్‌లో పర్యాటకులను రక్షించిన లైఫ్ గార్డులు

విశాలాంధ్ర - సాగర్ నగర్ : ఋషికొండ బీచ్‌లో మునిగిపోతున్న ముగ్గురు పర్యాటకులను జీవీఎంసీ లైఫ్ గార్డులు రక్షించారని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు శనివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.హైదరాబాద్ కు చెందిన 20 మంది పర్యాటకులు శనివారం 17-08-2024 వ తేదీన నగరంలో గల ఋషి కొండ బీచ్ లో స్నేహితులతో కలసి సరదాగా గడిపేందుకు వచ్చారని, వారిలోముగ్గురు స్నేహితులు దీపక్ (15 సం.) నితిన్ (15 సం.) కౌశిక్ (18 సం.) రిప్ కరెంటు లో పడి బీచ్ లోపలికి వెళ్ళిపోతూ మునిగి పోతున్న వారిని నగరంలో బీచ్ ప్రాంతాల్లో నిత్యం నిఘాలో ఉంటున్న జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ సతీష్ ,రాజు లు గమనించి వారిని రక్షించి బయటకి తీసుకువచ్చి మిగిలిన స్నేహితులకు అప్పగించడం జరిగిందని అదనపు కమిషనర్ తెలిపారు.విశాఖ నగరానికి సందర్శకులు, విహారయాత్రికులు, నగర ప్రజలు విశాఖ తీర అందాలను తిలకించేందుకు నిత్యం సముద్రతీరానికి వస్తూ ఉంటారని, సముద్రంలో ప్రమాదాలకు గురికాకూడదని జీవీఎంసీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ సందర్శకులు బీచ్ లలో స్నానానికి దిగి లోతట్టు ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని, ఎవరూ కూడా సముద్ర తీర ప్రాంతం వెంబడి బీచ్ లలో స్నానాలకు వెళ్ళి తమ ప్రాణాలకు అపాయం కలిగించుకోరాదని అదనపు కమిషనర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

సీనియర్ జర్నలిస్టు నరసింహను సత్కరించిన విశ్వభారత్ ట్రస్టు

విశాలాంధ్ర - పెందుర్తి : నగరానికి చెందిన విశ్వభారత్ మీడియా అండ్ ట్రస్ట్ సభ్యులు సీనియర్ జర్నలిస్టు నరసింహంను ఘనంగా సత్కరించింది. వందే విశ్వభారత్ వీర పురస్కార్ ను సాహిత్యం కేటగిరిలో ఆయనకు అందజేసారు. విశ్వభారత్ మీడియా చైర్మన్ బలివాడ రమేష్, మేనేజింగ్ డైరెక్టర్ భీమరశెట్టి వాసుదేవ్ లు నరసింహంను ఘనంగా సత్కరించి మెమెంటోను అందచేసారు. ఈ సందర్భంగా అటు మీడియా పరంగాను, ఇటు సాహిత్యపరంగాను నరసింహం సమాజానికి అందిస్తున్న సేవలను ట్రస్టు సభ్యులు ప్రస్తుతించారు. కాగా విశ్వభారత్ ట్రస్టు యాజమాన్యానికి నరసింహం కృతజ్ఞతలు తెలియచేసారు.